క్లుప్తంగా

చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి



ఇల్లెందు: చలివేంద్రం ప్రారంభిస్తున్న జడ్జీ కీర్తి చంద్రికరెడ్డి

పాల్వంచ: వేసవిని దృష్టిలో ఉంచుకుని స్వచ్ఛందంగా చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని, వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కె.సుజాత అన్నారు. సోమవారం స్థానిక దమ్మపేట సెంటర్‌లో శ్రీకనకదుర్గ కాస్టింగ్, ఇంజనీరింగ్ వర్క్స్ నిర్వాహకులు లింగమర్ల కృష్ణారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను కమిషనర్ ప్రారంభించారు. కార్యక్రమంలో సీహెచ్.రంగారావు, అజీజ్, కృష్ణ, నాయుడు, తేజ్, శ్రీనివాస్, సీతారాంరెడ్డి, రాము, భద్రయ్య, అబ్దుల్ ఘనీ, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఇల్లెందు కోర్టులో..

ఇల్లెందు: ఇల్లెందు కోర్టులో బార్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని జడ్జీ దేవరపల్లి కీర్తి చంద్రికరెడ్డి సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో బార్ అధ్యక్షులు ఉమామహేశ్వరరావు, కీర్తి కార్తీక్, నవీన్, వెంకటనర్సయ్య, దంతాల ఆనంద్, కలవల సుధాకర్, మహేష్, జయప్రకాష్, రవికుమార్, ధనుంజయరావు, పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సూపర్‌బజార్(కొత్తగూడెం): భజన మందిరం 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో 11 కేవీ రైతుబజార్ ఫీడర్ మరమ్మతుల నేపథ్యంలో మంగళవారం కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నేతాజీ మార్కెట్, పెద్దబజారు, చిన్నబజారు, ఎంజీ రోడ్, కూలీలైన్, సూర్యోదయ స్కూల్ ఏరియా, శ్రీనగర్‌కాలనీ, గణేశ్‌బస్తీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

సెలవులో పెద్దమ్మతల్లి ఆలయ ఈఓ

పాల్వంచరూరల్: మండలంలోని శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయ ఈఓ రజనీకుమారి సెలవులో వెళ్లారు. ఈ నెల 11వ తేదీ వరకు ఆమె సెలవుపై వెళ్లగా, ప్రభుత్వ సెలవులు కలుపుకుని తిరిగి 14న విధుల్లో చేరతారు.

స్వయం శక్తితో ఆర్థికాభివృద్ధి సాధించాలి

టేకులపల్లి: ఎవరో వస్తారని, ఏదో చేస్తారని ఎదురు చూడకుండా యువతీ, యువకులు స్వశక్తితో స్వయం ఉపాధి మార్గాలు చూసుకుని, ఆర్థికాభివృద్ధి సాధించాలని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పోస్టాఫీస్ సెంటర్‌లో తోటకూరి జయంత్, గౌతమి దంపతులు ఏర్పాటు చేసిన షాప్‌ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఇస్లావత్ రెడ్యానాయక్, పోశాలు, ఈదిగణేశ్, తోటకూరి కృష్ణయ్య, బండ్ల రజిని, బండ్ల శ్రీనివాస్, నరేశ్, అనిల్, శివాజీ, విజయ్, సాయి, చక్రి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వార్షికోత్సవం

కొత్తగూడెంఅర్బన్: పాఠశాల వార్షికోత్సవాలు విద్యార్థుల్లో విశ్వాసాన్ని నింపుతాయని వార్డు మాజీ కౌన్సిలర్ రుక్మాంగదర్‌బండారి తెలిపారు. సోమవారం కూలీలైన్ ప్రభుత్వ పాఠశాల వార్షికోత్సవంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసేది విద్యనే అని, ఒక మంచి లక్ష్యాన్ని ఏర్పరచుకొని, దానిని చేరుకునే వరకు విశ్రమించొద్దని సూచించారు. అనంతరం హెచ్ఎం బి.లాల్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ మునిగ సుజాత మాట్లాడారు. అనంతరం ఉపాధ్యాయులను సత్కరించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

గురుకులంలో ఆందోళన

కొత్తగూడెంఅర్బన్: రామవరంలోని గిరిజన బాలికల గురుకులంలో ఓ ఉపాధ్యాయిని.. విద్యార్థులను కొట్టిందనే సమాచారం అందుకున్న తల్లిదండ్రులు సోమవారం ఆందోళన చేశారు. విద్యార్థులు క్లాసుకు ఆలస్యంగా రావడంపై ఉపాధ్యాయిని మందలించి కొందరు విద్యార్థులను కొట్టడంతో వారంతా కూడా వారి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. విద్యార్థుల తల్లిదండ్రులు గురుకులానికి చేరుకొని ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్‌ను నిలదీయడంతో వారు కూడా జరిగిన విషయం చెప్పగా తల్లిదండ్రులు తిరిగివెళ్లిపోయారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా క్లాసులకు ఆలస్యంగా రావడం వల్లనే ఉపాధ్యాయిని.. విద్యార్థులను మందలించిందని తెలిపారు.

అవగాహన కల్పించాలి

కొత్తగూడెంఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకంపై ముస్లింలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని జిల్లా మైనారిటీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎండీ యాకూబ్‌పాషా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రజల కష్టాలు



వనందాస్ గడ్డ బస్తీలో నీరు రావడం లేదని చెబుతున్న స్థానికులు

రామవరంలో తాగునీటికి కటకట

- రెండు రోజులకోసారే కిన్నెరసాని నీళ్లు
- అది కూడా అర గంటే విడుదల
- ఫలితంగా కనీస అవసరాలు తీరడం లేదని స్థానికుల ఆవేదన

కొత్తగూడెంటౌన్: ఇంట్లో ప్రతీ అవసరానికి నీళ్ల అత్యవసరం. అయితే, కళ్ల ముందు కిన్నెరసాని పంపులు ఉన్నా ఎక్కువ ప్రెషర్ రాకపోవడం, తక్కువ సమయం వదులుతుండడంతో కనీస అవసరాలకు సరిపోక ఇబ్బంది పడుతున్నామని కొత్తగూడెంలోని రామవరం ప్రజలు ఆవేదన చెందుతున్నారు. గంటల తరబడి ఎదురుచూసినా పట్టుమని అర గంట కూడా నల్లాలు రాక సరిపడా నీళ్లు పట్టుకోలేకపోతున్నామని చెబుతున్నారు.

ఏడు వార్డుల్లో సమస్య

కొత్తగూడెంలోని పలు వార్డుల్లో కిన్నెరసాని నీళ్లు సరిపడా విడుదల చేస్తున్నా రామవరానికి వచ్చేసరికి 20 లేదా 30 నిమిషాలు మాత్రమే విడుదల చేయడం ప్రజల సమస్యకు కారణమవుతోంది. రామవరం పరిధిలోని 6, 7, 8, 9, 10, 11, 12వ వార్డుల్లో ఈ సమస్య ఉండగా, ఎన్నిసార్లు అధికారులకు చెప్పినా సమస్య పరిష్కారం కావడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎండలు మండుతున్న నేపథ్యాన ఇంట్లో అవసరాలకేమో కానీ తాగునీటికి సైతం నీళ్లు సరిపోవడం లేదని చెబుతున్నారు. రెండు రోజులకు ఒక్కసారి కిన్నెరసాని పంపులు వస్తున్నా తక్కువ సమయం, అదీ తక్కువ ప్రెషర్‌తో విడుదల చేస్తున్నారని ఆవేదన చెందుతున్నారు. మిగతా వార్డుల్లో మాత్రం ఎక్కువ ప్రెషర్‌తో గంటన్నరకు పైగా కిన్నెరసాని నీటిని వదులుతుండడం.. తమ వార్డులపై చిన్నచూపు చూడడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రామవరం పరిధి వార్డుల్లో కిన్నెరసాని పంపులను ప్రతిరోజు విడుదల చేయాలని, అది సాధ్యం కాకపోతే రెండు రోజులకోసారైనా రెండు గంటల పాటు ఎక్కువ ప్రెషర్‌తో వదలాలని డిమాండ్ చేస్తున్నారు.

తెల్లవారి నిద్ర లేచినా..

రామవరంలోని వనందాస్‌గడ్డ బస్తీ, చిట్టి రామవరం, నాగయ్యగడ్డ బస్తీ, పటేల్‌బస్తీ, ఎస్‌సీబీ నగర్, సీఆర్‌పీ క్యాంప్, పంజాబ్‌గడ్డ బస్తీ, నేతాజీబస్తీ, చమన్‌బస్తీ, వేణుగోపాల్ నగర్ కాలనీ, నెహ్రూబస్తీ ప్రాంతాల్లో తాగు నీటి కటకట ఉంది. దీంతో తాము నానా అవస్థలు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. బస్తీలో కిన్నెరసాని పంపులు ఉన్నా తక్కువ ప్రెషర్‌తో వస్తున్నాయని చెబుతున్నారు. తెల్లవారుజామునే ఐదు గంటలకు కొన్నిసార్లు, ఆరు లేదా ఎనిమిది గంటలకు ఇంకొన్ని సార్లు కిన్నెరసాని పంపులను వదిలినా పట్టుమని అర గంట కూడా రావడం లేదని.. ఇకనైనా సరిపడా నీళ్లు అందేలా విడుదల చేయాలని కోరుతున్నారు.

ఇబ్బందులు లేకుండా సరఫరా

రామవరానికి రెండు రోజులకోసారి గంటకు పైగా కిన్నెరసాని నీళ్లు విడుదల చేస్తున్నాం. సమస్యలు ఉంటే పరిష్కరించి ఇక నుంచి ప్రజలకు ఇబ్బందులు లేకుండా నీరు సరఫరా చేస్తాం. ఎండకాలంలో నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాం.

–రవికుమార్, డీఈ, మున్సిపాలిటీ

గంటన్నరకు పైగా వదలాలి



కిన్నెరసాని పంపులు ఉన్నా సరిగ్గా రావడం లేదు. రెండు రోజులకోసారి తక్కువ ప్రెషర్‌తో 20 నిమిషాలు కూడా నీరు అందడం లేదు. ఇప్పటికైనా మున్సిపాలిటీ అధికారులు స్పందించి కిన్నెరసాని నీళ్లను మా ప్రాంతానికి గంటన్నర పాటు విడుదల చేయాలి.

–బానోతు శ్రీనివాస్‌నాయక్, రామవరం

అధికారులు దృష్టి సారించాలి..



రామవరంలోని బస్తీల్లో కిన్నెరసాని నీళ్లు అందక ఇబ్బంది పడుతున్నాం. మిగతా వార్డుల్లో మాదిరి రామవరంలోనూ పంపులను గంటన్నర వరకు వదలాలి. అధికారులు దృష్టి సారిస్తే మాకు తాగునీటితో పాటు ఇతర అవసరాలకు నీటి సమస్య తీరుతుంది.

–రాజ్‌కుమార్, వనందాస్‌గడ్డబస్తీ

నీళ్లు సరిపోవడం లేదు..



కిన్నెరసాని నీళ్ల పంపులు తక్కువ ప్రెషర్‌తో, తక్కువ సమయం వస్తుండడంతో మా బస్తీవాసులం ఇబ్బంది పడుతున్నాం. ఎండాకాలం కావడంతో నీళ్ల అవసరం విపరీతంగా పెరుగుతోంది. కానీ, పంపుల ద్వారా వచ్చే నీరు సరిపోక ఇంటిల్లిపాది అవస్థ పడుతున్నాం.

–గద్దల స్వరాజ్యం, రామవరం

రాజాధిరాజుగా శ్రీరామనారాయణుడు



శ్రీరామ మహాపట్టాభిషేకం జరిపిస్తున్న అర్చకులు



వేడుకను తిలకించేందుకు తరలివచ్చిన భక్తులు

నాగుల్‌మీరా దర్గాలో వైభవంగా శ్రీరామ పట్టాభిషేకం

ఇల్లెందురూరల్: కల్యాణ రాముడు భక్తుల జయ జయ ధ్వానాల నడుమ సోమవారం రాజాధిరాజుగా పట్టాభిషిక్తుడయ్యారు. ఇల్లెందు మండలంలోని హజరత్ నాగుల్‌మీరా మౌలాచాన్ చిల్లా దర్గా ప్రాంగణంలో వేదపండితుల మంత్రోచ్చరణ, భక్తుల జైశ్రీరామ్ నినాదాల నడుమ శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం కనుల పండువగా సాగింది. కల్యాణ రాముడిని రాజాధిరాజుగా పట్టాభిషిక్తుడిని చేయడం పలు చోట్ల జరుగుతుంది. కానీ హజరత్ నాగుల్‌మీరా దర్గాలో మాత్రం పంచాయుధాలతో పట్టాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. సుదర్శన చక్రం, శంఖు, గధ, ఖడ్గం, విష్ణు ధనస్సులను శ్రీరామునికి అలంకరించడమే కాక వేదమంత్రోచ్చరణ నడుమ శ్రీరామునికి కిరీటధారణ చేసి పట్టాభిషేకం జరిపించారు.

దమ్మక్క వారసుల పిండివంటలు

శ్రీరామనారాయణుడి పట్టాభిషేకం సందర్భంగా రామభక్తురాలు పోకల దమ్మక్క వారసులైన సత్యనారాయణపురం గ్రామ ఆదివాసీలు ఎర్ర బియ్యం, నల్ల బియ్యంతో తయారు చేసిన పాయసం, ఇప్పపువ్వుతో లడ్డు, ఎర్ర గోధుములతో రొట్టెలు, ఉల్వలు, ఇప్పపువ్వు గుడాలు, పులిహోర, చెక్కెర పొంగళి, పండ్లు తదితరాలను నైవేద్యంగా సమర్పించారు. కాగా, పట్టాభిషేకాన్ని తిలకించేందుకు దర్గా ప్రాంగణానికి భక్తులు భారీగా తరలివచ్చారు. అనంతరం దర్గా కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. అలాగే, పలువురు యువతులు చేసిన భరతనాట్యం, కూచిపూడి నృత్య ప్రదర్శనలు అలరించాయి.

ఉపాధి కూలీలకు కాస్త ఊరట

రోజువారీ కూలీ రూ.7 పెంచిన కేంద్రం



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

సుజాతనగర్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీలకు రోజువారి వేతనం రూ.7 పెంచుతూ కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కొత్త వేతనం ఈ నెల 1వ తేదీ నుంచి అమల్లోకి వచ్చింది. మండలంలోని 20 గ్రామ పంచాయతీల పరిధిలో 6,573 జాబ్ కార్డులకు గాను 10,666 మంది కూలీలు ఉన్నారు. ఉపాధి కూలి రూ.300 నుంచి రూ.307గా పెంచడంతో ప్రస్తుతం పనిచేస్తున్న 2,600 మందికి ప్రయోజనం చేకూరనుంది. వ్యవసాయ పనులు తగ్గడంతో ఉపాధి పనికి హాజరయ్యే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ప్రస్తుతం రోజుకు 2 వేల నుంచి 2,600 మంది కూలీలు హాజరవుతున్నారు. ఫీడర్ చానల్, హరితహారంలో నాటిన మొక్కల సంరక్షణ, ఇంకుడు గుంతల నిర్మాణం, కందకాలు, మట్టిరోడ్ల నిర్మాణం తదితర పనులు జరుగుతుండగా, కొద్దిరోజులైతే కూలీల సంఖ్య మరింత పెరుగుతుందని భావిస్తున్నారు. ఈ విషయమై ఎంపీడీఓ బి.భారతి మాట్లాడుతూ.. గ్రామాల్లో జాబ్‌కార్డులు ఉన్న వారు ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అటవీ జంతువులకు నీటి వసతి



అవెన్యూ ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న ఎఫ్‌డీఓ కోటేశ్వరరావు

జూలూరుపాడు: వేసవి దృష్ట్యా అటవీ జంతువుల దాహార్తి తీర్చేందుకు నీటి వసతి కల్పించాలని కొత్తగూడెం ఎఫ్‌డీఓ యు.కోటేశ్వరరావు సూచించారు. మండలంలోని సురారం సమీపాన కనకగిరి అటవీ ప్రాంతాన్ని ఎఫ్‌డీఓ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జంతువుల కోసం నీటి ఏర్పాట్లు, అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకుంటున్న చర్యలపై ఆరా తీసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అడవిలో ఎవరు కూడా చెట్లు నరకకుండా నిఘా పెంచాలని ఆదేశించారు. ఆ తర్వాత అవెన్యూ ప్లాంటేషన్‌ను కూడా ఎఫ్‌డీఓ పరిశీలించారు. ఎఫ్ఆర్ఓ జి.ప్రసాద్‌రావు, డీఆర్ఓ ఎస్‌కే నాసూర్‌బీ, ఎఫ్ఎస్ఓ ఎం.హన్మంతు, ఎఫ్‌బీఓలు శ్రీలత, డి.కిషన్ పాల్గొన్నారు.

కార్మికులకు ఉపాధి కల్పించాలి



సంఘీభావం తెలుపుతున్న బీఆర్ఎస్‌వీ నాయకులు

పాల్వంచ: కేటీపీఎస్ 6వ దశ నిర్మాణ కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించి న్యాయం చేయాలని బీఆర్ఎస్‌వీ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక కేటీపీఎస్ అంబేడ్కర్ సెంటర్‌లో నిర్మాణ కార్మికులు చేస్తున్న దీక్షలకు సోమవారం బీఆర్ఎస్‌వీ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిర్మాణ సమయంలో ప్రాణాలకు తెగించి పనిచేశారని, అర్హులైన వారిని యాజమాన్యం విస్మరించిందన్నారు. ఇప్పటికైనా వారికి ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బేతంశెట్టి విజయ్, కిరణ్, రంజిత్, జూపెల్లి దుర్గాప్రసాద్, కంచర్ల రామారావు, సాయి, దీపక్, శోభన్, రవి, అలీ మెహతాబ్, సోను, ఉదయ్, వినోద్, సిద్ధు, అఖిల్, శివ, సాయి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

డీర్ పార్కు ఎఫ్‌బీఓగా ఉమాదేవి

పాల్వంచరూరల్: వైల్డ్‌లైఫ్ డివిజన్ పరిధిలోని యానంబైల్ రేంజ్ కిన్నెరసాని డీర్‌పార్కు బీట్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న బట్టు రాములు నాయక్ సెక్షన్ ఆఫీసర్‌గా ఉద్యోగోన్నతిపై దమ్మపేటకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో కారెగట్టు బీట్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఉమాదేవికి డీర్‌పార్కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించినట్లు ఎఫ్‌డీఓ బాబు తెలిపారు.

సీఎండీకి జ్ఞాపిక అందజేత

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్‌కు పాలిటెక్నిక్ 17వ వార్షిక జ్ఞాపికను సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ గుండా శ్రీనివాస్ సోమవారం కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. ఎడ్యుకేషన్ విత్ డెడికేషన్ నినాదంతో బోధన, బోధనేతర సిబ్బంది విధులు నిర్వర్తించాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దాలని పేర్కొన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కళాకారులు

జూలూరుపాడు: ప్రభుత్వ సంక్షేమ పథకాలపై సోమవారం తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల బృందం ప్రజలకు అవగాహన కల్పించారు. జూలూరుపాడు ఎస్సీకాలనీలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు రుణమాఫీపై కళాకారులు పాటలతో చైతన్య పరిచారు. రాజీవ్ యువ వికాసం పథకంతోపాటు వేసవి దృష్ట్యా వడదెబ్బ తగలకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలు, పరిసరాల పరిశుభ్రత, తడి, పొడి చెత్త, ప్లాస్టిక్ నియంత్రణపై ప్రజలకు కళాకారులు వివరించారు. కార్యక్రమంలో సాంస్కృతిక సారథి కళాకారులు కాంపల్లి బాలు, నందు, మూసా, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న విద్యార్థి నాయకులు

కొత్తగూడెంఅర్బన్: భారతదేశంలోనే మొట్టమొదటి ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీని కొత్తగూడెంలో ఏర్పాటు చేయడంపై ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు అజ్మీర సురేశ్‌నాయక్ తెలిపారు. సోమవారం యూనివర్సిటీలో విద్యార్థులతో కలిసి ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో పవన్, సాయి, లకవత్ సుమన్, తరుణ్‌సింగ్, శివ, షేక్ సాను, కాటి సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం రైతుల్లో వర్షాల భయం



రెడ్డిగూడెంలో రైతులు ఆరబోసిన ధాన్యం

పాల్వంచరూరల్: రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందన్న సమాచారంతో ధాన్యం సాగు చేసిన రైతుల్లో ఆందోళన నెలకొంది. ఉగాది పండుగ నాటి నుంచి వరి కోతలు ఆరంభించిన రైతులు కల్లాల వద్ద ధాన్యం ఆరబోశారు. ఇప్పటికీ అధికారులు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో వర్షం వస్తే ధాన్యం తడిస్తే నష్టపోతామనే ఆందోళన వెల్లువెత్తుతోంది. మండలంలో 4,850 ఎకరాల మేర వరి సాగు చేయగా కొందరు మాత్రం ప్రైవేట్ వ్యాపారులకు కల్లాల వద్దే పచ్చి వడ్లు విక్రయిస్తున్నారు. మరికొందరు ప్రభుత్వ మద్దతు ధర, బోనస్ వస్తుందనే భావనతో ప్రభుత్వ కేంద్రాల కోసం ఎదురుచూస్తూనే వర్ష భయంతో ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై పీఏసీఎస్ కార్యదర్శి శ్రీనివాస్‌ను వివరణ కోరగా వరి కోతలు ఇప్పుడిప్పుడే మొదలవుతున్నాయని తెలిపారు. మండలంలో ఐదు కొనుగోలు కేంద్రాలను మూడు, నాలుగు రోజుల్లో ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

మత సామరస్యానికి ప్రతీక

భద్రాచలంలో ముస్లింల సేవలు



వాటర్ బాటిళ్లు పంచుతున్న అహ్మద్

పాల్వంచ: మత సామరస్యానికి ప్రతీకగా శ్రీరామ నవమికి భద్రాచలానికి వచ్చిన భక్తులకు పాల్వంచకు చెందిన నేతాజీ యువజన సంఘం అధ్యక్షుడు ఎస్‌జేకే అహ్మద్ సోమవారం సేవలందించారు. శ్రీసీతా రామచంద్రస్వామి దేవాలయంలో శ్రీరామ మహాపట్టాభిషేకానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఓఆర్ఎస్, మజ్జిగ ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లు, పండ్లు, బిస్కెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌జేకే అహ్మద్ మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో సభ్యులు సయ్యద్ అక్బర్, ఓం ప్రకాష్, నాయుడు పాల్గొన్నారు.

ఆరోగ్యంతో ఆనందకర జీవితం



కొత్తగూడెంఅర్బన్: మాట్లాడుతున్న న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి భానుమతి



సూపర్‌బజార్(కొత్తగూడెం): కలెక్టరేట్ ఎదుట నినాదాలు చేస్తున్న విద్యార్థులు, వైద్యులు



పాల్వంచరూరల్: ప్లకార్డులు ప్రదర్శిస్తున్న జగన్నాథపురం పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది



సింగరేణి(కొత్తగూడెం): అవగాహన కల్పిస్తున్న జీఎం శాలేంరాజు పక్కన అధికారులు

కొత్తగూడెంఅర్బన్: ఆరోగ్యంతోనే ఆనందకర జీవితం లభిస్తుందని, మారుతున్న కాలానికి అనుగుణంగా ఆరోగ్యంపై ప్రతిఒక్కరూ శ్రద్ధ వహించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి సూచించారు. సోమవారం స్థానిక బాబూక్యాంప్ ప్రభుత్వ హైస్కూల్‌లో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా జరిగిన అవగాహన కార్యక్రమంలో న్యాయమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆరోగ్య సమస్యలు లేని జీవితాన్ని గడపాలంటే కచ్చితంగా జీవనశైలి పద్ధతులను మార్చుకోవాల్సి ఉంటుందన్నారు. అనంతరం డిప్యూటీ డీఎంహెచ్ఓ జయలక్ష్మి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమం అనంతరం బాబూక్యాంపులో ఉన్న భవిత సెంటర్‌ను న్యాయమూర్తి సందర్శించారు. అక్కడ పిల్లలకు అందుతున్న సౌకర్యాల గురించి ఆరా తీశారు. కార్యక్రమంలో కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సభ్యుడు లక్కినేని సత్యనారాయణ, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పి.నిరంజన్‌రావు, డిప్యూటీ డెమో ఫయాజుద్దీన్, హెచ్ఎం నీరజ, ఉపాధ్యాయులు షేక్ దస్తగిరి, చందర్‌రావు, సునందిని తదితరులు పాల్గొన్నారు.

అవగాహన నడక..

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ వైద్య కళాశాల, కమ్యూనిటీ మెడిసిన్ విభాగం, వైద్య విద్యార్థులతో సోమవారం ఆరోగ్య అవగాహన నడక నిర్వహించారు. మొదటి, మూడో సంవత్సరం చదువుతున్న ఎంబీబీఎస్ విద్యార్థులు ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, కమ్యూనిటీ మెడిసిన్ హెచ్ఓడీ వనిత యెల్లి, హెచ్ఆర్ హృదయ్‌చందు, రత్నమణి, ప్రసన్న, సుధాకర్, గోపాల్, స్మృతి, శ్రీవాత్సవ్, భద్రమ్మ, లక్ష్మీబాయి, సుమలత, శ్రవణ్, సాయి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచలో..

పాల్వంచరూరల్: ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా అవగాహన పెంచుకోవాలని డాక్టర్ రాజు అన్నారు. సోమవారం మండలంలోని జగన్నాథపురం పీహెచ్‌సీలో ప్లకార్డులు పట్టుకుని ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ సుందర్, డీపీఓ సాలిత, పర్యవేక్షణ అధికారి పి.కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

జీఎం కార్యాలయంలో..

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియాలోని జీఎం కార్యాలయంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా అధికారులకు, ఉద్యోగులకు సింగరేణి మెడికల్, హెల్త్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో హెల్త్ ఆఫీసర్ పరశురాములు, డి.లలిత అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. ఆరోగ్యమే మహాభాగ్యమని ప్రతిఒక్కరూ వారి, వారి వ్యక్తిగత జీవితాలతో మంచి ఆరోగ్య అలవాట్లను అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎండీ రజాక్, సాగర్, సౌజన్య, రామకృష్ణ, శివకేశవరావు, ఎస్.యోహాన్, తోట సత్యనారాయణ, బి.మాధవ్ తదితరులు పాల్గొన్నారు.